క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దీపారాధన



కాంతులీనుతున్న లక్షన్నొక్క దీపాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధి వద్ద స్థానిక యాదవ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపం నుంచి గొల్లవీధి వరకు సుమారు లక్ష ఒక ప్రమిదల్లో ఒత్తులు వేసి దీపాలు వెలిగించారు. చూడముచ్చటగా జరిగిన దీపారాధన కార్యక్రమంలో చుట్టుపక్కల మహిళలు పాల్గొన్నారు. దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

ఉత్సాహంగా లుమియర్-24 వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, పలు కళాశాలల విద్యార్థులు

కంచరపాలెం : క్విజ్, వక్తృత్వం, గ్రామర్ వంటి పోటీల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శనివారం కళాశాలలో లుమియర్ 2కె24 అంతర కళాశాలల పోటీలు ఘనంగా నిర్వహించారు. 8 డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వీఎస్ కృష్ణ, గాయిత్రి, ఏవీఎన్, సెయింట్ ఆన్స్, సెయింట్ జోసెఫ్ కళాశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిగా ద్వితీయ భాషా విభాగం అధ్యాపకులు పి.కె. జయలక్ష్మి హాజరైన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నళిని, వీణ, ప్రమీల, సుధ, టోనియా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ, కేజీహెచ్‌లో ఫార్మాకో విజిలెన్స్ వీక్



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో శనివారం ఫార్మాకో విజిలెన్స్ వీక్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొన్ని మందుల వల్ల కలిగే దుష్ప్రభావంపై ఎంబీబీఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోగులు, వారి సహాయకులకు కరపత్రాలు పంపిణీ చేసి ఫార్మాకో విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కేజీహెచ్‌లో కూడా దీనిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ నర్సింగ్ విద్యార్థులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ డి. శ్యామల, ఏఎంసీ ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. హిమబిందు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



సహస్ర తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : శనివారం ఉదయం 8 గంటలకు కనకమహాలక్ష్మి అమ్మవారికి నిర్వహించిన సహస్ర తులసిపూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజకు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పూజలో ఉభయదాతలు పాల్గొనవచ్చు.

52వ వార్డులో.. వింత పోకడ!

- టీడీపీ వార్డు అధ్యక్షుడినంటూ కార్యాలయం కోసం ఒత్తిడి
- జీవీఎంసీ అధికారులపై పెత్తనం
- శాంతినగర్ కమ్యూనిటీ హాలులో గది ఇచ్చేందుకు సన్నాహాలు
- ముక్కున వేలేసుకుంటున్న సొంత పార్టీ నేతలు



ఈ కమ్యూనిటీ హాల్లో ఉన్న ఒక గది పార్టీ కార్యాలయం కానుంది?



శాంతినగర్ కమ్యూనిటీ హాలు

గోపాలపట్నం: ఆయనొక అప్రకటిత వార్డు అధ్యక్షుడు.. ఎన్నికల ముందే టీడీపీలో చేరాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వార్డంతా తనదే నంటూ బిల్డప్పు ఇస్తున్నాడు. తానే వార్డు టీడీపీ అధ్యక్షుడినంటూ దర్పం చూపిస్తున్నాడు. అంత వరకూ ఓకే...

అధికార దర్పం!

అనధికారిక వార్డు టీడీపీ అధ్యక్షుడిగా చలామణి అవుతున్న సదరు నేత అధికారిక కార్యాలయంపై మనసు పడ్డాడు. ఇంకేముంది శాంతినగర్ కమ్యూనిటీ హాలులో ఒక గది తనకు కేటాయించాలని సచివాలయ అధికారులను వేధించడం మొదలు పెట్టాడు. వారి వల్ల కాకపోవడంతో ఇప్పుడు ఎమ్మెల్యే పేరిట జీవీఎంసీ జోన్ అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాడు. దీంతో ఆయనకు కమ్యూనిటీ హాలులో ఒక గది కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. దీనిపై సొంత పార్టీ నాయకులే విమర్శలు గుప్పించడం విశేషం. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులకు లేని దర్పం కొత్తగా వచ్చిన వాడికి ఎందుకంటూ ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. కార్యాలయమే కావాలనుకుంటే సొంత నిధులతో ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు.

ఏ పదవీ లేకపోయినా..

టీడీపీలో సదరు బిల్డప్ బాబాయ్‌కి ఏ పదవీ లేదు. సామాన్య కార్యకర్త మాత్రమే. అలాంటి వ్యక్తి జీవీఎంసీ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

శాంతినగర్ కమ్యూనిటీ హాలులో రెండు అంతస్తులున్నాయి. పై అంతస్తులో రెండు సచివాలయాలు ఉన్నాయి. దిగువన హాలు, మండపం వెనుక రెండు గదులు ఉన్నాయి. ఇందులో ఒక గది సీవో కొన్నాళ్లు విధులు నిర్వహించేందుకు, ఫైళ్లు భద్రపర్చుకోవడానికి వినియోగించేవారు. ఇటీవల గణేష్‌నగర్‌లో ఉన్న వార్డు శానిటరీ కార్యాలయం, మలేరియా విభాగం కార్యాలయం పడగొట్టి కొత్త భవనం నిర్మించడంతో వీరు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వారిని ఇక్కడి నుంచి పంపించేందుకు ఒత్తిడి తీసుకు వస్తున్నారు. కార్యాలయ పనులు పూర్తయితే వెళ్తామని చెప్పినా దిగువ అంతస్తు పూర్తయిందని వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి నాయకుడిని అదుపులో పెట్టకపోతే పార్టీకి చెడ్డ పేరు వస్తుందని టీడీపీ నాయకులే చెప్పుకుంటున్నారు. బిల్డప్ బాబాయ్‌లను ఎమ్మెల్యే కూడా ప్రోత్సహించడంతో కొందరు సీనియర్ నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కొండచిలువ హల్‌చల్



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

సింధియా: నౌసేనా బాగ్‌లోని వాహనాల పార్కింగ్ ప్రదేశంలో శనివారం కొండచిలువ హల్‌చల్ చేసింది. పార్కింగ్ ప్రదేశంలో సంచరిస్తుండడంతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురై కేకలు వేశారు. వెంటనే స్పందించిన నేవీ అధికారులు స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగరాజు కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టాడు.

ఏచూరి సేవలు చిరస్మరణీయం



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు భోగవల్లి నాగభూషణం, జగ్గునాయుడు తదితరులు

మల్కాపురం: పేద,బడుగు బలహీన వర్గాల ప్రజలు, కార్మికులకు దివంగత నేత సీతారాం ఏచూరి చేసిన సేవలు చిరస్మరణీయం అని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు అన్నారు. హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు వద్ద శనివారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న వీరు తొలుత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ సౌమ్యుడు అయిన ఏచూరి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వారు అన్నారు. జన కోసం తన చివరి శ్వాస వరకు పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో ఇంటక్,సీఐటీయూ నాయకులు తాతబాబు,ఆర్ లక్ష్మణమూర్తి,పెంటారావు,నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్కాపురం : ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరిని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒ వ్యక్తి కాళ్లు నుజ్జునుజ్జు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీహరిపురంలో నివాసం ఉంటున్న అగ్రహారపు బాబు (49) స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై మిత్రుడు ఆదినారాయణను తీసుకుని డాక్‌యార్డ్ నుండి సింధియా వైపు వస్తుండగా అదే రోడ్డుపై ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నుంచి ఇద్దరూ తుళ్లిపోయారు. రోడ్డుపై పడిన అగ్రహారపు బాబు రెండు కాళ్ల మీదుగా లారీ చక్రం వెళ్లడంతో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదినారాయణ స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి విచారించారు. తీవ్రంగా గాయపడిన బాబును చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసును మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివపదం.. భావితరాలకు మార్గదర్శకం



ముగింపు కార్యక్రమంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ, ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు

మద్దిలపాలెం: శివపదాలు అంతరంగ భావాలకు ప్రతిబింబాలుగా, ఆధ్యాత్మిక చైతన్య ప్రబోధాలుగా, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. శివపదం సంకీర్తన యజ్ఞం చివరి రోజు శనివారం శివ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమాన్ని షణ్ముఖశర్మ, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు, కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణ గాయత్రి, వి.వి.ఆదినారాయణమూర్తి, టి.రవిరాజు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బ్రహ్మశ్రీ షణ్ముఖ శర్మ ప్రవచిస్తూ శివ నామస్మరణ మానవీయ ప్రబంధానికి ఎంతో దోహదపడుతుందన్నారు. శివపదాల భావాన్ని అర్థం చేసుకుని అవగతం చేసుకుంటే జీవనం ఆధ్యాత్మికతతో నిండిపోతుందని చెప్పారు. సంగీతం, సాహిత్య పరంగా తాను రచించిన శివపదాలను ప్రముఖ సంగీత విద్వాంసులు స్వరపరచి, తమ మధురగానం, చక్కని శాస్త్రీయ నృత్య కళారీతులతో ప్రదర్శిస్తూ ఖండాంతరాలకు చాటిచెప్పే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. శివపదాలు విశ్వవ్యాప్తం చేస్తున్న కళాకారులు, కళాభిమానులకు పరమశివుడి ఆశీస్సులు లభిస్తాయన్నారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కౌశిక్ కల్యాణ్ తమ శిష్య బృందం తెన్నేటి, ఓలేటి సోదరీమణులు, దేవులపల్లి గోపీకిషోర్ బృందాలు గానామృతంతో సభికులను మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ,వి శాఖ రుషిపీఠం సత్సంగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్ ఇ.కె.జనకులం మాస్టర్ ఇ.కె. ఆధ్యాత్మిక సేవా కేంద్రం ప్రధాన నిర్వాహకులు శ్రీమాన్ ఎక్కిరాల అనంత కృష్ణ, కో ఆర్డినేటర్ సిహెచ్.శ్రీనివాసరాజు, వ్యాఖ్యాత పేరాల హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు జియ్యానికి ఆహ్వానం

గోపాలపట్నం: ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించబోయే అర్బన్ గవర్నెన్స్ ఇండెక్స్ రెండో ఎడిషన్‌లో పాల్గొనేందుకు ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్ నుంచి ఆహ్వానం అందిందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలోని అశోక్ నగర్‌లో ఉన్న బాంక్వెట్ హాల్ మూడో అంతస్తులో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంవోహెచ్‌యూఏ, ఎన్ఐటీఐ, ఎన్ఐయూఏ వంటి ఏజెన్సీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారన్నారు. ఇటువంటి కార్యక్రమానికి ఆహ్వానం అందడంపై శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

సందడిగా శాంతినగర్

- ఆట పాటలతో పిల్లల కేరింతలు
- నోరూరించిన ఐస్‌క్రీమ్ కేక్, పీచు మిఠాయి
- అలరించిన బౌన్సింగ్ జారుడు బల్ల
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



బౌన్సింగ్ జారుడు బల్లపై చిన్నారుల సందడి



శాంతినగర్‌లో చిన్నారులతో ఎంజాయ్ చేస్తున్న తల్లిదండ్రులు



అలరించిన చిన్నారి నృత్యం

గోపాలపట్నం : చిన్నారుల కేరింతలతో శనివారం సాయంత్రం శాంతినగర్ సందడిగా మారింది. వినాయక చవితి సందర్భంగా శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో సాయంత్రం చిన్నారులను అలరించేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన వేదికపై మేజిక్ షో, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, డ్యాన్సులు ఉర్రూతలూగించాయి. బౌన్సింగ్ జారుడు బల్లపై చిన్నారులు జారుతుంటే పెద్దలు ఆనందంగా వీక్షించారు. నిర్వాహకులు అందించిన బెలూన్లు, చాక్‌లెట్ కేకులు, పీచు మిఠాయిలతో చిన్నారుల ఆనందం ముచ్చటగొలిపింది. బాలికలకు మెహందీ పెట్టేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ కిటకిటలాడింది. అలాగే టాటూస్ వేయించుకునేందుకు అంతా ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ చిన్నారుల సంతోషం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా బాగుందన్నారు. పిల్లల మొహాల్లో సంతోషాన్ని, కేరింతల్ని చూస్తుంటే ముచ్చటగా ఉందన్నారు. నిర్వాహకులు శాంతినగర్ యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకుడు జియ్యాని విజయ్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను సమీక్షించారు.



మెహంది, టాటూస్ వేయించుకుంటున్న చిన్నారులు



చాక్‌లెట్ కేక్ కోసం గుమిగూడిన చిన్నారులు

ప్రజారోగ్యం పట్టదా?

● డంపర్‌బిన్లుగా నేలబావులు ● వ్యర్థాలు తొలగించాలని స్థానికుల వినతులు ● పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



మూడు నూతుల ఏరియా వద్ద ఇలా..



మల్కాపురం గొల్లవీధి నేల బావి దుస్థితి

మల్కాపురం: మొన్నటి వరకూ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన నేలబావులు నేడు డంపర్ బిన్లుగా మారాయి. బావుల్లో నీరు సురక్షితం కాదని సూచించడంతో వినియోగానికి బ్రేక్ పడింది. అయితే వాటిలో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు నిలయంగా మారాయి. ఈ పరిస్థితుల్లో బావుల్లో వ్యర్థాలు తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి, మూడు నూతల ఏరియా ప్రాంతంలో సుమారు వంద సంవత్సరాల చరిత్ర గల నేలబావులు ఉన్నాయి. మల్కాపురం ప్రాంత వాసులు ఈ నేలబావుల నుంచే తమ తమ ఇంటి అవసరాల కోసం నీటిని తీసుకు వెళ్లే వారు. కాల క్రమంలో వీధికి ఒక్క బోరు రావడంతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బోర్లు వేసుకోవడంతో నేలబావులకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో బావులు ఓపెన్‌గా ఉండడంతో ఆ నీరు తాగడానికి సురక్షితం కాదని అధికారులు సూచించడంతో మిగిలిన వారు కూడా వినియోగించడం మానేశారు.



నేలబావిలో పేరుకుపోయిన వ్యర్థాలు

ట్యాంకుల ఏర్పాటు

15 ఏళ్ల కిందట ఆయా ప్రాంతాల్లోని నేలబావులకు సమీపంలో పైలెట్ వాటర్ ప్రాజెక్ట్‌లో భాగంగా నేల బావి నీటిని బయటకు తీసి దాన్ని క్లోరినేషన్ చేసి వాటర్ ట్యాంక్‌లో పంపించేవారు. దానికి ఏర్పాటు చేసిన ట్యాప్‌ల ద్వారా స్థానికంగా ఉండే వారు ఎప్పుడు తాగునీరు కావాలంటే అప్పుడు పట్టుకునే వారు. నేలబావిలో ప్రమాదవశాత్తు ఎవరూ పడకుండా ఇనుప గ్రిల్స్ కూడా అమర్చారు.అయితే ఈ గ్రిల్స్ అమర్చి సంవత్సరాలు గడవడంతో అవి తుప్పు పట్టిపోయాయి.దీంతో పలువురు ఈ నేల బావుల్లో వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో బావుల్లో ఉన్న నీరు నాచు పట్టి దుర్వాసన వెదజల్లుతోంది. నేలబావుల్లో లో క్రిమికీటకాలు పెరిగి బావులకు సమీపాన ఉన్న వారి ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో నివాసితులు పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.అధికారులు స్పందించి నేల బావుల్లో ఉన్న వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.పై కప్పులను స్టీల్ ప్లేట్ మాదిరిగా (కీటకాలు చేరకుండా,వ్యర్థాలు డంప్ చేయకుండా ఉండే విధంగా) ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

పేదలకు అండగా ఉంటాం



63వ వార్డులో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా : పేదలకు అండగా ఉండి, వారి కష్టాలు తీర్చేది కూటమి ప్రభుత్వమే అని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో, 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు అండగా నిలిచి భరోసా కల్పించి, ఎన్నో సంక్షేమ పథకాలకు బాటలు వేసిందన్నారు. అనంతరం 63వ వార్డులోని మున్సిపల్ కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ములగాడ ఎమ్మార్వో, జోనల్ కమిషనర్, 63వ వార్డు నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, మెడికల్ కృష్ణ, బీజేపీ, జనసేన నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మకు జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అన్నారు. శనివారం ఏఎంసీ సెంటినరీ ఎగ్జామ్ హాల్లో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రొగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ క్యాంపస్‌ను ర్యాగింగ్ ఫ్రీగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997 దాని సవరణల ముఖ్య లక్షణాలను వివరించారు. యాంటీ ర్యాగింగ్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇస్కఫ్ కృషి నిరుపమానం



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

మహారాణిపేట : దేశ సమగ్రత, సంస్కృతి, మత సామరస్యానికి ఇస్కఫ్ ఎంతో కృషి చేస్తోందని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. శనివారం ప్రభుత్వ మహిళా కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్, ఐఎస్‌సీయూఎఫ్) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సంస్థ అనేక జాతీయ, అంతర్జాతీయ శాంతి ఉద్యమాల్లో పాల్గొందన్నారు. ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇస్కఫ్ నాయకుడు టీఎస్ సుకుమారన్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వై.వెంకట లక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ కాలేజీలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్‌కు చెందిన నరసింహులు, ఎం.ఎ. బేగం, పద్మకుమారి, డి.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.